


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :104 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ శనివారం 07 ఫిబ్రవరి 2026

## బలప్రదర్శన కాదు..
# అభివృద్ధి ముఖ్యం

**రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తామని వెల్లడి**

**గత ప్రభుత్వంలో పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని విమర్శ**

**కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని ఆరోపణ**

**భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ**

వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు.





## పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం -: మంత్రి సీతక్క

-కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' తరహా పథకం తెస్తున్నామన్న సీతక్క

-సర్వే చేయించి పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామన్న మంత్రి ప్రతి పేద కుటుంబానికి సాయం అందిస్తామని వెల్లడి



## ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు...
### 15 మంది మృతి

-ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో భారీ పేలుడు
-ఘటనలో 15 మంది మృతి, 80 మందికి పైగా గాయాలు
-శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో జరిగిన దాడి
-ఇది ఆత్మాహుతి దాడి అని అనుమానిస్తున్న అధికారులు



## విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వమే

బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నారా లోకేశ్

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపు

దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని వెల్లడి



## మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై
# ధార్మిక బాధ్యత ఉంటుంది

**హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు**

**కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం**

**కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య**

**మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ**

ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు.హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన



వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

## తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

ఎన్నికల ప్రచారం రద్దయినట్టు ప్రకటించిన జనసేన

అనివార్య కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం



## ఇంత స్పష్టమైన ఆధారాలున్నా వైసీపీ నేతలు
# ఎదురుదాడి చేయడం సిగ్గుచేటు: అనిత

**-కల్తీ నెయ్యి వ్యవహారంపై అనిత ప్రెస్ మీట్ -గత వైసీపీ ప్రభుత్వంపై ఆరోపణలు**

**-హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ ఫైర్**



# బలప్రదర్శన కాదు.. అభివృద్ధి ముఖ్యం

అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు.గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు.రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వమే

‘టీం 11‘ బృందం కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచుకుని, ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో క్లీన్‌చిట్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అనే విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా చివరకు మన దేవాలయం లాంటి టీడీపీ ఆఫీసుకే వస్తారు. పార్టీని బలోపేతం చేసేందుకు మనం అహర్నిశలు కష్టపడాలి“ అని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తుచేశారు.

**బూత్ స్థాయి నుంచే పార్టీ పునర్నిర్మాణం**

“గ్రామస్థాయి నుంచి కాదు, బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది“ అని లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల తర్వాత కొన్ని బూత్‌లలో వేవ్ ఉన్నా ఎందుకు గెలవలేకపోయామనే కారణాలను అన్వేషించాలన్నారు.

తన అనుభవాన్ని వివరిస్తూ, “1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ జెండా ఎగరలేదు. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిన చోటే గెలవాలని కార్యకర్తలతో కలిసి బూత్‌ల వారీగా సమీక్షించి, నాలుగేళ్లు తూచా తప్పకుండా పనిచేసి విజయం సాధించాం“ అని తెలిపారు. సంస్థాగత నిర్మాణంపై నమ్మకంతోనే గెలిచానని, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం**

ఐదు జోన్లలో 4,772 బూత్‌లను బలోపేతం చేసేందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించినట్లు లోకేశ్ వెల్లడించారు. “ప్రతి నాయకుడు బూత్‌కు కనీసం ఒక రోజు కేటాయించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుని, పార్టీ బలోపేతానికి నివేదిక ఇవ్వాలి. ఇకపై బూత్ పనితీరు ఆధారంగానే రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో పదవులు దక్కుతాయి,“ అని ఆయన స్పష్టం చేశారు. పసుపు జెండా కోసం ప్రాణాలు త్యాగం చేసిన అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే తనకు స్ఫూర్తి అని అన్నారు.

**కూటమి ప్రభుత్వ ఘనతలను వివరించాలి**

“దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌ది. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు వేగవంతం చేశాం. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం,“ అని లోకేశ్ తెలిపారు. రూ.4 వేల పింఛను, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, 16 వేల టీచర్ పోస్టుల భర్తీ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

కూటమిలో విడాకులు ఉండవు

“రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళితేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన కూటమిలో విడాకులు, మిస్ ఫైర్‌లు, క్రాస్ ఫైర్‌లు ఉండవు. ఏవైనా సమస్యలుంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. వైసీపీ మన మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది, అందరూ అప్రమత్తంగా ఉండాలి“ అని లోకేశ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లు.. స్వయంగా పరిశీలించిన కలెక్టర్

## క్యూలైన్లు, సౌకర్యాలపై అధికారులకు కీలక ఆదేశాలు-18న చక్రతీర్థం.. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం

శ్రీకాకుళం

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీముఖలింగం క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, మంచినీటి వసతి, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. అత్యవసర సేవల కోసం మెడికల్ టీమ్స్, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉత్సవాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకూడదని, సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**చక్రతీర్థ యాత్రకు ప్రత్యేక ప్రణాళిక :**

ఉత్సవాల్లో అత్యంత కీలకమైన చక్రతీర్థ స్నానాల ఏర్పాట్లపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. 18వ తేదీన ఉదయం 10 గంటల వరకే భక్తులకు దర్శనాలు ఉంటాయని, మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థ యాత్ర ప్రారంభమవుతుందని ఆలయ సిబ్బంది ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచే ఒడిశా తదితర ప్రాంతాల నుంచి యాత్రికుల రద్దీ పెరుగుతుందని, వారందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ స్థలాలు, ఇతర వసతులు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా చక్రతీర్థ స్నానాల రోజు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, వంశధార నది తీరంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు కు సీసీటీవీ, పార్కింగ్ ప్రదేశాలు ,కంట్రోల్ రూమ్ లో ఉండవలసిన ఇతర శాఖల సిబ్బంది కి సూచనలు జారీ చేశారు. శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని కోరారు.ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా కలెక్టర్ తో పాటు రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, జలవనరులు శాఖల అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

# క్షేత్ర పరిశీలన చేసి రైతులకు ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించిన రెవెన్యూ ఫిషరీస్ అధికారులు

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం

రేపల్లె మండలం గంగడి పాలెం రెవిన్యూ గ్రామంలో గల మృత్యుంజయ పాలెం గ్రామస్తులు అయిన బెల్లంకొండ శ్రీనివాసరావు మరియు కొంతమంది రైతులు గంగడి పాలెం గ్రామ సర్వేనెంబర్ 60, 61, 67/1ఎ సర్వే నెంబర్లలో కొక్కిలిగడ్డ సాయిబాబు అనువారు ఉప్పునీటి రొయ్యలు సాగు చేయుచున్నారని ఉప్పునీటి రైతు సాగు చేయడం వలన వారి పక్కనే గల వ్యవసాయ భూములు పంట పండకుండా పాడైపోతున్నవని రొయ్యల సాగు నిలుపుదల చేయవలసిందిగా బాపట్ల జిల్లా కలెక్టర్ వారికి గ్రీవెన్స్ లో అర్జీ అందజేశారు ఈ విషయమై రేపల్లె మండల తాసిల్దార్ వారు జీడి ఫిషరీస్ సురేష్ కుమార్ ఎఫ్ డి ఓ ఎంఏఓ క్షేత్ర పరిశీలన చేసి మాగాణి భూములు గల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రొయ్యల సాగు చేసుకోవలసినదిగా తెలియజేసి ఉన్నారు. అందుకుగాను కొక్కిలిగడ్డ సాయిబాబాను వారు పక్కన గల వ్యవసాయ భూములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని తెలియజేసి ఉన్నారు అందుగులకు పక్క మాగాన్ని భూములు గలవారు అంగీకరించి ఉన్నారు. కావున మృత్యుంజయ పాలెం గ్రామస్తులు పెట్టుకున్నటువంటి అర్జీని రేపల్లె మండల తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు క్షేత్ర పరిశీలన చేసి సమస్యను పరిష్కరించడం జరిగిందని తాసిల్దార్ తెలిపారు



# పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం

తెలంగాణ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. కేరళలో అమలు చేస్తున్న ‘కుటుంబశ్రీ‘ మోడల్ ను అనుసరించి ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. కేరళలో ఒక సర్వే నిర్వహించారని... దాని ద్వారా 65 వేల మంది పేదలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సర్వే చేయించి, పేదరికంలో ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి తగిన సాయం అందిస్తామని సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడినా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

# ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు...

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో ఓ షియా మసీదు లక్ష్యంగా జరిగిన ఈ భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను స్థానిక అధికారులు ధృవీకరించారు.ఇస్లామాబాద్‌లోని ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనను తాను పేల్చుకుని ఉండవచ్చని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఈ దాడిని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఇస్లామాబాద్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ తాజా ఘటనతో రాజధానిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం రద్దయింది. ఇంతకు ముందు వెలువడిన ప్రకారం రేపు, ఎల్లుండి ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారం రద్దయినట్టు జనసేన ప్రకటించింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, పవన్ వ్యక్తిగత కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం. మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో ఈ ఉదయం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో పవన్ చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు

# ఇంత స్పష్టమైన ఆధారాలున్నా వైసీపీ నేతలు ఎదురుదాడి చేయడం సిగ్గుచేటు: అనిత

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో భారీ కుంభకోణం జరిగిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్ల పాలన ‘కల్తీకి కేరాఫ్ అడ్రస్‘గా నిలిచిందని, పవిత్రమైన శ్రీవారి ప్రసాదంలోకి కూడా కల్తీని తీసుకొచ్చి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు.నెయ్యిలో కల్తీ జరిగిందని చెప్పడానికి తమ వద్ద నాలుగు కీలక నివేదికలు ఉన్నాయని అనిత స్పష్టం చేశారు. 2022లోనే మైసూర్‌లోని జఖీ=× నివేదిక నెయ్యిలో పామాయిల్ ఉన్నట్లు తేల్చిందని, కేంద్ర ప్రభుత్వ ల్యాబ్ చీణణదీ అందులో జంతువుల కొవ్వు ఉన్నట్లు నిర్ధారించిందని తెలిపారు. ఇక చీణ=× రిపోర్ట్ ప్రకారం అది నెయ్యే కాదని, రసాయనాల ముద్ద అని తేలిందని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని సిట్ (రా×) కూడా కల్తీని ధృవీకరించిందని అన్నారు. ఇంత స్పష్టమైన ఆధారాలున్నా వైసీపీ నేతలు ఎదురుదాడి చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.కేవలం కొంతమందికి లబ్ధి చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా నీరుగార్చారని, రూ.254 కోట్ల ఈ స్కామ్‌లో అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిదే ప్రధాన బాధ్యత అని అనిత ఆరోపించారు. ఆయన సంతకం లేకుండా ఇది ఎలా జరిగిందని ప్రశ్నించారు. “కల్తీ జరగలేదని చెప్పడానికి వైసీపీ దగ్గర ఒక్కటంటే ఒక్క అధికారిక నివేదిక ఉందా? ‘సాక్షి‘ పత్రికలో వచ్చే రాతలే మీకు రిపోర్టులా?“ అని ఆమె ఎద్దేవా చేశారు.అయోధ్య రామాలయానికి కూడా ఈ కల్తీ లడ్డూలనే పంపి మహాపచారానికి ఒడిగట్టారని అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అనుమతి లేకుండా ‘పరామర్శ యాత్రల‘ పేరుతో ప్రజలను ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హోంమంత్రిగా హెచ్చరించారు. దైవద్రోహానికి పాల్పడినందుకే ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసి బుద్ధి చెప్పారని అన్నారు.

# కోహీర్ మున్సిపల్ కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మాణిక్ రావు

కోహీర్)

కోహీర్ మున్సిపాలిటీలోని బిఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో గౌరవ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు,సీనియర్ నాయకులు కలీమ్, స్థానిక నాయకులు,కార్యకర్తలతో కలిసి జోరుగా ప్రచారం చేశారు.పట్టణంలోని వివిధ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వెయ్యాలని కోరారు. కెసిఆర్ ఇచ్చిన పథకాలే ఇంకా కొనసాగుతున్నాయని తప్పకుండ కారు గుర్తుకు ఓటు వేస్తామని మహిళలు, వృద్దులు ముక్తకంఠంతో ఎమ్మెల్యే, చైర్మన్ అన్నారు.కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓటు అడిగారు.



# సంక్షేమ పథకాలు పునరుద్ధరణ

## -కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించినట్లు భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జున రావు (బాబ్జి) తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం వారి సమస్యల పరిష్కారం పై అమరావతిలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారని బాబ్జి చెప్పారు. సమావేశంలో తనతో పాటు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సీఎం ఒక కార్యదర్శి కార్తికేయ మిశ్ర, కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు పాల్గొన్నారన్నారు. కార్మికుల సంక్షేమంపై ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. కార్మికుల వివాహానికి 40,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని, మహిళా కార్మికులకు ప్రసూతి సమయంలో 20వేల రూపాయలు, కార్మికుడు సహజ మరణం పొందితే కుటుంబానికి 60 వేల రూపాయలు, అంత్యక్రియల నిమిత్తం 20000 రూపాయలు, తక్షణ సహాయంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలా పలు చర్యలు చేపట్టామన్నారు. దాదాపు 20 లక్షల మంది కార్మికులకు శిక్షణ ఇస్తామని, ప్రైవేట్ సెక్టార్ లో పనిచేస్తున్న కార్మికులకు ఎల్ అండ్ టి, రిలయన్స్ వంటి కార్పొరేషన్ల సహకారంతో శిక్ష కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. 40 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు




నిర్వహిస్తారని, పనిచేసే ప్రదేశంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆరోగ్యశ్రీ పరిమితి దాటిన ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధులు గాని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా గాని మెరుగైన వైద్యం వేల చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు బాబ్జి చెప్పారు. సమావేశంలో రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, పెంటపాడు టిడిపి నాయకులు కిలపర్తి వెంకట్రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు

# యూనిఫైడ్ ఫ్యామిలీసర్వే తో ప్రజలకు లబ్ది

## మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: ప్రభుత్వం నిర్వహిస్తున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలియజేశారు. ఆయన శుక్రవారం పట్టణంలోని 3, 4 ,5, 6 ,16 వార్డులలో పర్యటించారు. సర్వేను మరింత వేగవంతం చేయడం కోసం నోడల్ ఆఫీసర్ లుగా ప్రతి సచివాలయానికి కేటాయించి ఉదయం 6 నుండి సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సచివాలయం సిబ్బందితో సర్వే పూర్తి చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సర్వే కోసం వచ్చి ఉద్యోగులకు ప్రజలు సహకరించాలని ఆయన



కోరారు. వెహికల్స్ కాలనీలో ములుగు కాలంలో దోమలహాలు అని చంపేందుకు ఆయన దగ్గర ఉండి పిచికారి చేయించారు . ప్రజలందరూ పరిసరాలను



పరిశుభ్రమించుకోవాలని పొడి చెత్త తడి చెత్త వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని చెప్పారు. సకాలంలో ఇంటి, కులాయి పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.



# శ్రీశైలక్షేత్రంలో హుండీల లెక్కింపు

అక్షరవిజేత,శ్రీశైలం:
శ్రీశైలం ఆలయంలో జరిగిన హుండీల లెక్కింపు ద్వారా శుక్రవారం దేవస్థానానికి రూ. 3,76,22,452/- నగదు రాబడిగా లభించింది.ఈ హుండీల రాబడిని భక్తులు గత 25 రోజులలో జనవరి 12 నుంచి ఫిబ్రవరి 5 వరకు సమర్పించడం జరిగింది.ఇందులో ఉభయ దేవాలయాల హుండీల ద్వారా 3,73,32,470/-లు మరియు అన్న ప్రసాదవితరణ హుండీల ద్వారా రూ. 2,89,982లు లభించాయి. కాగా అప్రైజర్ హాజరు కాని కారణంగా బంగారు, వెండి లెక్కించబడలేదు. అదేవిధంగా 526 యుఎస్ఏ డాలర్లు, 84 సింగపూర్ డాలర్లు, 140 కెనడా డాలర్లు, 10 - ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఈరోస్, 55 - ఇంగ్లాండు ఫౌండ్స్, 28 - మలేషియా రింగిట్స్,10 - సౌదీరియాల్స్, 800 - ఓమన్ బైసా, 1435 యు.ఎ.ఇ దిర్హామ్స్ ఈ హుండీల లెక్కింపులో లభించాయి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపులో ధర్మకర్తల మండలి అధ్యక్షులు రమేష్‌నాయుడు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్.రమణమ్మ, పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు,సిబ్బంది,శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

## - డిప్యూటీ ఎంపీడీవో గపూర్

రామసముద్రం,ఫిబ్రవరి06,విజేత
రామసముద్రం గ్రామ పంచాయతీ నందు శుక్రవారం ఇంటి పన్నుల వసూలను మరియు ఫ్యామిలీ సర్వేను డిప్యూటీ ఎంపీడీవో గపూర్ పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్ తో కలసి పరిశీలించారు. ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేసి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ గపూర్, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్, పంచాయతీ సర్వే యర్ శ్రీనివాసులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులుచట్టాలపై అవగాహనతోపాటు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి-సీ ఐ రవి నాయక్

రామసముద్రం, ఫిబ్రవరి 06 విజేత
అన్నమయ్య జిల్లా ఎస్పీ దిరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు, రామసముద్రం మండలంలోని చెంబకూరు జడ్పీ స్కూల్ నందు శుక్రవారం మదనపల్లి రూరల్ సీఐ రవి నాయక్, సిబ్బంది, మదనపల్లి శక్తి టీం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.
ఈ అవగాహన కార్యక్రమంలో ముఖ్యంగా టీనేజ్ వయస్సులో ఎదురయ్యే ఆకర్షణలను నియంత్రించకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, వాటికి సంబంధించిన కేస్ స్టడీస్,పోక్సో చట్టం పై పూర్తి వివరణ కల్పించారు.చదువు ద్వారా వ్యక్తిగత స్థాయిని పెంపొందించుకోవాలని,మన ప్రవర్తన ఇతరులకు ఆదర్శంగా ఉండాలని అన్నారు.తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయకుండా బాధ్యతా యుతంగా నడుచుకోవాలని,చిన్న చిన్న విషయాలకు గొడవలు పడకుండా సహనంతో వ్యవహరించాలని అన్నారు.ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, సెల్ ఫోన్ల ద్వారా జరుగుతున్న మోసాలు మరియు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన విధానం,గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల పిల్లల జీవితాలకు కలిగే దుష్ప్రభావాల పట్ల అవగాహన కల్పించారు. అంతేకాకుండా, మహిళలు మరియు పిల్లల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ఉపయోగాలు, అత్యవసర సహాయ నెంబర్లు 1930, 112, 1098 గురించి కూడా విద్యార్థులకు వివరించారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చట్టాలపై అవగాహనతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామసముద్రం ఏఎస్ఐ హిమాచలపతి, హెడ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్, సురేంద్ర, మదనపల్లి శక్తి టీం , మునికుమార్ నాయక్, మణికంఠ ,శశి కళ ,వీణ కుమారి, మహిళా పోలీస్ చందన, ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు,ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు




# ఉండవల్లిలో కుంభకోణం కాఫీ షాపు ప్రారంభం

## ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి

మంగళగిరి-అక్షరవిజేత
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఉండవల్లి దేవుడు మాన్యం వద్ద జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దీక్ష మీడియా చైర్మన్ జొన్న రాజేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుంభకోణం కాఫీ షాపును శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో



కుంభకోణం కాఫీ షాపు ఏర్పాటు ఇదే తొలిసారి అని తెలిపారు. షాపు నిర్వాహణలో నాణ్యతా, ప్రమాణాలను పాటించాలని ఈ సందర్భంగా చిల్లపల్లి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఏంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి మారుతి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బళ్ల ఉమామహేశ్వరరావు, ఉండవల్లి గ్రామ మాజీ సర్పంచ్ జొన్న శివశంకర్, బడే సాంబశివరావు, సాధు చంద్రశేఖర్, అంబటి తిరుపతిరావు, చాముండేశ్వరి దేవి, జనసేన పార్టీ ఉండవల్లి గ్రామ అధ్యక్షులు రాజా రమేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, దినేష్ చక్రవర్తి, తెలుగుదేశం పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టిడిపి ఉండవల్లి గ్రామ అధ్యక్షులు నరేంద్ర, నాయకుల తోట సాంబశివరావు, బసివి రెడ్డి, లింగం శెట్టి కిషోర్, జంగాల సాంబశివరావు రోటరీ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# టిడిపిలో చేరిన వైసిపి నాయకులు




విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తాడేపల్లి గూడెం నియోజవర్గం పెంటపాడు మండలం వెస్ట్ విప్పర్ కు చెందిన మాజీ సర్పంచ్ , వైయస్ఆర్సీపీ నాయకుడు పసల చంటి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతోపాటు గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు కూడా పార్టీలో చేరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, వలవల బాబ్జి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన పసల చంటి మాట్లాడుతూ తాను ప్రజా సేవ చేసేందుకే పార్టీలో చేరినట్లు చెప్పారు సమావేశంలో ఏఎంసి మాజీ చైర్మన్ పాతూరి రాంప్రసాద్ చౌదరి, గారపాటి భాస్కరరావు, నల్లమిల్లి గోపిరెడ్డి, ములగాల బాబ్జి, రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకాశపు స్వామి, పద్మనాభుని మురళి , సబ్నివిసు కృష్ణమోహన్ గురుజు సూరిబాబు, బండారు వెంకట్రావు, దాసరి కృష్ణవేణి, ముప్పిడి రమేష్, కుదుళ్ళ చంద్రశేఖర్, నేక్కలపూడి వీర్రాజు, వాసా గణపతి, అచ్యుత సత్యనారాయణ, మరియు పెంటపాడు మండలం గ్రామ పార్టీ ప్రెసిడెంట్, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్చ్ 14 న జాతీయ లోక్ అదాలత్

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల అనగా 14న తాడేపల్లిగూడెం కోర్ట్ ల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు 11వ అదనపు జిల్లా జడ్జి శ్రీ షేక్ సికిందర్ బాషా తెలియచేశారు. ఈ లోక్ అదాలత్ లో అన్ని కోర్టులలో పెండింగ్ లో ఉన్న రాజి పడదగ్గా క్రిమినల్ కేసులు అన్ని రకాల సివిల్ కేసులు మనోవర్తి, గృహహింస, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు రాజి చేసుకోవచ్చు అని బ్యాంకు, టెలిఫోన్ ప్రీ ల్టిగేషన్ కేసులు రాజ్ చేసుకోవచ్చు అని తెలియచేసారు .తద్వారా కాక్షిదారులు సమయం డబ్బు ఆదా చేసుకోవచ్చు అని ఈ అవకాశాన్ని కాక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు



# 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

## -మండల విద్యాశాఖ అధికారి -కేఆర్ ఎస్ వి వి అప్పారావు

విజేత దేవరపల్లి
దేవరపల్లి మండలంలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాల లలో 2026-27 విద్యా సంవత్సరంలో 5 సంవత్సరములు నిండిన పిల్లలకు ఒకటవ తరగతిలో ప్రవేశం కొరకు విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1) జ అమల్లో భాగంగా ఒకటవ తరగతిలో ప్రవేశం కొరకు 20.02.2026 నుండి 10.03. 2026 వరకు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న మరియు బలహీనవర్గాల పిల్లలకు చెందిన పిల్లల నుండి దరఖాస్తులు ఆహ్వానించుచున్నారు .విద్యార్థులు ఆధార్ ద్వారా ప్రాథమిక వివరాలతో http://cse.ap.gov.in వెబ్సైట్ నందు కేటాయింపు జరుగును. దరఖాస్తులు సమర్పించుటకు కావలసిన డాక్యుమెంటులు.



. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ కొరకు తల్లిదండ్రుల ఆధార్ కార్డు లేదా వాటర్ కార్డు లేదా రేషన్ కార్డు లేదా విద్యుత్ బిల్లు మొదలైనవి
. పిల్లల వయసు ధ్రువీకరణ పత్రము
. అర్హత వయస్సు 02.06. 2020 నుండి 31. 3. 2021 జన్మించి 5సంవత్సరములు నిండి ఉండవలెను. అని మండల విద్యాశాఖ అధికారి కె ఆర్ ఎస్ వి వి అప్పారావు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు .

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున

విజేత మంత్రాలయం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేటుగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం ఎస్ఐ. మల్లికార్జున పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు, శుక్రవారం మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో గ్రామస్తులకు సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ కీలక సూచనలు తెలియజేశారుఅపరిచిత లింకులు: వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దు. లాటరీ తగిలిందని, తక్కువ ధరకే వస్తువులు ఇస్తామని వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.ఓటిపి (ఆూ) షేరింగ్: బ్యాంక్ అధికారులు ఎప్పుడూ ఫోన్ చేసి ఓటిపి అడగరని, మీ వ్యక్తిగత వివరాలు లేదా ఓటిపిలను ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు.నకిలీ యాప్‌లు: లోన్ యాప్‌ల పేరుతో వేధించే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ప్లే స్టోర్‌లో అధికారిక యాప్‌లను మాత్రమే వాడాలని సూచించారు.సోషల్ మీడియా జాగ్రత్తలు: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి.ఫిర్యాదు చేయడం ఎలా?
ఒకవేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, ఆలస్యం చేయకుండా వెంటనే ఈ క్రింది విధంగా స్పందించాలని ఎస్ఐ సూచించారు: టోల్ ఫ్రీ నంబర్: వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.ఆన్‌లైన్ ఫిర్యాదు: www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాలి.సమయం ముఖ్యం: మోసం జరిగిన మొదటి 2 గంటల (+శీశ్రీ.నవఅ ఎశీబతీ) లోపు ఫిర్యాదు చేస్తే, పోగొట్టుకున్న సొమ్మును వెనక్కి తెచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# వడ్డి రఘురామ్‌కు వైసీపీ శ్రేణుల భారీ మద్దతు

విజేత (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడుకు మద్దతుగా నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు కదులుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పెంటపాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి రఘురామ్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.



పెంటపాడు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కైకాల శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షులు గుండుమోగుల నాగు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుండుమోగుల వెంకటరమణ ఆధ్వర్యంలో ఆకుతీకపాడు నుండి సుమారు 100 మంది కార్యకర్తలు రఘురామ్ నాయుడును కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా కైకాల శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎవరికి బాధ్యతలు అప్పగించినా వారి వెంటే ఉంటామని స్పష్టం చేశారు. “గతంలో తోట గోపి గారు, కొట్టు సత్యనారాయణ గారు ఇంచార్జిలుగా ఉన్నప్పుడు ఎలా పనిచేశామో, ఇప్పుడు వడ్డి నాయకత్వంలో కూడా పార్టీ బలోపేతం కోసం అదే విధంగా శ్రమిస్తామని చెప్పారు. పెంటపాడు మండలం నుండి వైఎస్సార్‌సీపీకి ఎప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుంది“ అని ఆయన వెల్లడించారు.
కార్యకర్తలన్ని ఉద్దేశించి వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్తకు ఒకే అజెండా ఉండాలని, అది జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమేనని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తను ఒక ఇంచార్జిగా భావిస్తానని ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందనీ అంతకరణ శుద్ధితో పనిచేసి వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం అని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో వాకా సుబ్బారావు ,నిమ్మల పెద కాపు, వేరాబత్తుల సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీను, గాదె సాయి, చీకటిమిల్లి నాగేష్, చింతాల నాగరాజు, దాసం బూరియ్య, ఆకుల శ్రీను, అలగంజి చిట్టిబాబు, గుండెపు కృష్ణ వేణి, బుద్దన చంటి పాల్గొన్నారు

## శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న వైయస్సార్సీపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వై .సీతారామరెడ్డి. పురుషోత్తం రెడ్డి

నంద్యాల జిల్లా.
శ్రీశైలం మల్లికార్జున స్వామి ని దర్శించుకున్న టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు /వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులు వై. సీతారామిరెడ్డి , వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులు ఆర్. పురుషోత్తం రెడ్డి , గజేంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు .



## ఏపీలో ఫిబ్రవరి 20 నుంచి పాఠశాలల్లో ఆర్టీఈ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అమరావతి
అమరావతి:విద్యా హక్కు చట్టం కింద 2026-27 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత కోటా సీట్ల ప్రవేశాలకు సమగ్ర శిక్షా అభి యాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు షెడ్యూల్ విడుదల చేశారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఫ్ట్‌జూ://ఱఎవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారాగాని, గ్రామ, వార్డు సచివాలయాలు, మండల విద్యావనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నుంచి దరఖాస్తులు సమర్పించవచ్చు. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశాలకు శుక్రవారం ప్రకటన విడుదల చేస్తారు. ఈ నెల 7 నుంచి 16 వరకు ప్రైవేటు పాఠశాలలు వివరాలను వెబ్సైట్లో నమోదు చేయాలి.
20 నుంచి మార్చి 10 వరకు విద్యార్థుల ఆన్లైన్ వివరాల నమోదు.మార్చి 17న గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా ప్రవేశాలకు విద్యార్థుల అర్హత నిర్ధారణ.
25న మొదటి విడత సీట్ల కేటాయింపు.
మార్చి 6 నుంచి ఏప్రిల్ 7 వరకు ప్రవేశాల ధ్రువీకరణ.
ఏప్రిల్ 12న రెండో విడత సీట్ల కేటాయింపు.
ఏప్రిల్ 13 నుంచి 23 వరకు పాఠశాలల ద్వారా విద్యార్థుల ప్రవేశాల ధ్రువీకరణ.సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబరు 18004258599 ద్వారా సంప్రదించవచ్చు

## 8న ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్నికలు

### ఎన్నికలు అధికారి విజయనగరం జిల్లా ఏపి పిఆర్ఎం అసోసియేషన్ అధ్యక్షులు మురళి

నక్కపల్లి,,విజేత :
ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎన్నికలు ఈనెల 8వ తేదీ (ఆదివారం) ఉదయం విశాఖలో గల జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద జరుగుతాయని ఆ సంఘం ఎన్నికలు అధికారి, విజయనగరం జిల్లా ఏపి పిఆర్ఎం అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏపి పిఆర్ఎం అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా గల అన్ని తాలూకా యూనిట్లు నుండి ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు సహా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈ ఎన్నికలలో విధిగా పాల్గొని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని అసోసియేషన్ ఎన్నికలు అధికారి, విజయనగరం జిల్లా ఏపి పిఆర్ఎం అసోసియేషన్ అధ్యక్షులు మురళి విజ్ఞప్తి చేశారు

# ఘనంగా కొండవీడు ఉత్సవాలు

### -ఏర్పాట్లను పరిశీలించిన మునిసిపల్ చైర్మన్ షేక్ రఫ్ఫాని



విజేత కొండవీడు
కొండవీడు చారిత్రక కొండవీడు కోటపై 7,8 తేదీలలో అనగా రేపు, ఎల్లుండి నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు, మునిసిపల్ చైర్మన్ షేక్ రఫ్ఫానినేడు కొండవీడును సందర్శించి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు.పర్యాటకుల సౌకర్యం ఉత్సవాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల కోసం త్రాగునీరు, వసతి, మరియు భద్రతా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.సాంస్కృతిక ప్రదర్శనలు కోట వైభవాన్ని చాటిచెప్పేలా రెండు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.నిరంతర పర్యవేక్షణ ఉత్సవాలు విజయవంతం అయ్యేలా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూస్తామని చైర్మన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, ఇతర ముఖ్య నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## షరీఫ్ వుద్దీన్ కునివాళులర్పించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్



విజేత మద్దినగర్ చిలకలూరిపేట పట్టణం మద్దినగర్ వాస్తవ్యులు షేక్ మగ్బుల్ కుమారుడు షేక్ షరీఫ్ వుద్దీన్ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థీవదేహానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఈ కార్యక్రమంలో అత్తలూరి షరీఫ్ , షేక్ కాలేషా తదితరులున్నారు.

## శ్రీశైలక్షేత్రానికి విస్తరాకులు విరాళం



అక్షరవిజేత,శ్రీశైలం:
శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబికా సేవా సమితి చీరాల వారు శుక్రవారం అన్నప్రసాద వితరణ విభాగానికి లక్ష విస్తరాకులను విరాళంగా అందజేశారు.వీటి విలువ రూ. 3,00,000/-లకు పైగా ఉంటుందని దాతలు తెలిపారు.అన్నపూర్ణభవనం నందు సహాయ కార్యనిర్వహణాధికారి వీటిని అందజేయడం జరిగింది.

## కొండవీడు ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు: సీఐ



విజేత కొండవీడు
కొండవీడులో ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు రూరల్ సీఐ సుబ్బనాయుడు తెలిపారు. శుక్రవారం ఘాట్ రోడ్డును సందర్శించిన ఆయన, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను కేటాయించామన్నారు. సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కలుగొట్ల లో సీఎం. చంద్రబాబు పట్టాదారు పాస పుస్తకాల పంపిణీ సభను కర్నూలుజిల్లా.క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన..కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్







ఎమ్మిగనూరు ఫిబ్రవరి 6
ఎమ్మిగనూర్ నియోజకవర్గం, కలుగొట్లలో మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్ ఐపియస్ కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ లు క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు తగిన భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూల్ రేంజ్ డిఐజి.కర్నూల్ ఎస్పీ తెలియజేశారు.కలుగొట్ల హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ని కర్నూల్ ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛశీ ను అందజేసి స్వాగతం పలికారు.జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.

# దారపాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం

### -సెల్ పోన్ తొ మాట్లాడుతూ డ్రైవింగ్



విజేత సింహాచలం::సెల్ పోన్ లొ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం తొ ఘోరమైన రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది, కాకినాడ నుండి కుటుంబం తొ కలసి శ్రీకాకుళం రాజులమ్మ గుడికి వెలుతున్న ఎపి 39 ఎన్.క్యూ 9350 బొలెరో వాహనం హనుమంతవాక నుండి వస్తున్న ఆర్టీసీ బస్సుని దారపాలెం వద్ద ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది,బొలెరో వాహనం డ్రైవర్ అక్కడికక్కడె మృతి చెందగా వాహనంలో వస్తున్న ముగ్గురు పిల్లలు,ఇద్దరు మహిళలు కు గాయాలు కావడంతో ఆసుపత్రి కి తరలించారు, బొలెరో వాహనం డ్రైవర్ సెల్ పోనులో మాట్లాడుతూ రోడ్డు మధ్యలోకి రాడంతొ అప్రమత్తమై బస్సును పూర్తిగా ఎడమవైపుకు నిలిపివేసానని ఆర్టీసీ బస్ డ్రైవర్ తెలిపారు,సెల్ పోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలనె ఘోర ప్రమాదం చోటుచేసుకుందని డ్రైవర్ మరణానికి కారణం అయ్యిందని ఆర్టీసీ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు, కండక్టర్ కు తలపై స్వల్ప గాయమవగా ఆసుపత్రి కి తరలించారు,బస్సును డ్రైవర్ సీటు వైపునుండి గుద్దుకుని కుడి వైపు బాగాన్ని రాసుకుంటూ పోవడంతో డ్రైవర్ వైపు డోరు వూడిపోయి, కొంతభాగం నుజ్జయిపోయింది, బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయిపోవటంతొ స్థానిక యువకులు సుమారు గంటపాటు గునపాలతొ పెకలించి మృతి చెందిన డ్రైవర్ ను బయటకు తీసారు, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేసి ప్రమాదానికి గురైన వాహనాలను తరలించారు.

# కొండవీడు అప్పుడు.. ఇప్పుడు... ఎప్పుడూ ఆంధ్రుల గర్వకారణమే : ప్రత్తిపాటి

- 2014-19లో కొండవీడును హెరిటేజ్ టూరిజం హబ్ గా మార్చాలన్న లక్ష్యంతో చంద్రబాబు అభివృద్ధి చేశారు : ప్రత్తిపాటి

- వైసీపీ ప్రభుత్వం రాకతో కొండవీడు వైభవానికి గ్రహణం పట్టింది : ప్రత్తిపాటి - నేడు, రేపు నిర్వహించే ఉత్సవాలు నభూతో అన్న విధంగా ఉంటాయి : ప్రత్తిపాటి

- కేంద్ర ప్రభుత్వ చేయూత.. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంతో కొండవీడు వైభవం భవిష్యత్ లో విశ్వవ్యాప్తం అవుతుంది : ప్రత్తిపాటి





విజేత కొండవీడు

" దక్షిణ భారతదేశంలోని అతి కీలకమైన చారిత్రక ప్రదేశం కొండవీడు. శత్రు దుర్భేధ్యంగా తమ రక్షణ కోసం నాటి రాజులు నిర్మించిన అతి కీలకమైన వ్యూహాత్మక కోటలలో కొండవీడు ప్రధానమైంది. దాదాపు 1200 అడుగుల ఎత్తులో కొండపైన నిర్మితమైన అబ్బురపరిచే నిర్మాణ సౌథం. 3 కి.మీ మేర నిర్మించిన భారీ కుడ్యాలు (గోడలు), రాజప్రాసాద అవశేషాలు, గుప్త సొరంగాలు, కొండపైనే నిర్మించిన జలాశయాలు (చెరువులు), ఆయుధ శాలలు, ఆధ్యాత్మిక జీవనం పెంపొందించేందుకు నిర్మించిన అపురూప ఆలయాలు ఇంతటి సమ్మిళిత నిర్మాణ విశిష్టత కొండవీడు కోటకు మాత్రమే సొంతం. వీటికి అదనంగా సహజ రక్షణతో కూడిన అద్భుతమైన సైనిక నిర్మాణ నమూనాల కేంద్రం కొండవీడు. ఇంతటి ఘన చారిత్రక వైభవం. అద్భుత నిర్మాణ శైలికి ప్రతిరూపమైన కొండవీడును గత పాలకులు పూర్తిగా విస్మరించారు. అక్కడి నిర్మాణాల్లోని గొప్పతనం, వైభవం వారి కళ్లకు కనిపించకపోవడం నిజంగా విచారకరం.

కొండవీడును హెరిటేజ్ టూరిజం హబ్ గా మార్చాలనే లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం కోటను అభివృద్ధి చేసింది

రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనమైన కొండవీడు విశిష్టత, ఖ్యాతిని గుర్తించిన నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కరే. ఆయన నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య కొండవీడు కోటను హెరిటేజ్ టూరిజం హబ్ గా మార్చాలనే లక్ష్యంతో పలు కీలక నిర్ణయాలు తీసుకుని, వాటిని వెంటనే ఆచరణలో పెట్టింది. కొండవీడు కోట విశిష్టతను తెలుగుజాతితో పాటు.. యావత్ దేశానికే తెలియచేయాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కోట సందర్శనకు అనువుగా అందమైన ఘాట్ రోడ్ నిర్మాణాన్ని చేపట్టారు. కొండపైన చారిత్రక కట్టడాల రక్షణకు ప్రాధాన్యమిస్తూనే , పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేశారు. రోప్ వే ప్రాజెక్ట్ చేపట్టాలని ప్రతిపాదించారు. అలానే లైట్ అండ్ సౌండ్ షో, లేజర్ షో, ట్రెక్కింగ్, వ్యూ పాయింట్ల అభివృద్ధి వంటి అనేక చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆనాడే కొండవీడును ఆంధ్రప్రదేశ్ హెరిటేజ్ క్యాపిటల్ గా ప్రచారం చేయాలనే ఉన్నతమైన ఆలోచన చంద్రబాబు చేశారు. ఏపీ టూరిజం సర్క్యూట్ లో కొండవీడుకు ఒక ప్రత్యేక స్థానం కల్పించారు. నాటి ఆయన చర్యల ఫలితంగా కొండవీడుకు సందర్శకుల తాకిడి పెరిగింది. రాష్ట్రం నలుమూల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలు, దేశ, విదేశాల నుంచి కూడా ఏపీకి వచ్చే పర్యాటకులకు కొండవీడు కోట వీక్షణం ఒక మరుపురాని మధుర జ్ఞాపకంగా మారింది. అప్పటి టీడీపీ ప్రభుత్వ కృషితో కొండవీడు కోట ఆంధ్రులకు గర్వకారణమైన పర్యాటక ప్రదేశంగా అవతరించింది. ఆ ఖ్యాతి విశ్వవ్యాప్తం అవుతుందనుకుంటున్న తరుణంలో టీడీపీ ప్రభుత్వం స్థానంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. దాంతో కొండవీడుకు గ్రహణం పట్టింది. నాటి వైభవం పూర్తిగా మసకబారిపోయింది. టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులన్నీ పిచ్చిచెట్ల పాలయ్యాయి.

**ఎన్డీయే ప్రభుత్వం వచ్చాకే కొండవీడుకు మహర్దశ**

మరలా 2024లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాకే కొండవీడు కోటకు మహర్దశ మొదలైంది. గతంలో తన మనసులోని ఆలోచనలకు కార్యరూపమిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కొండవీడు పునర్వైభవంపై దృష్టి సారించారు. ఆ క్రమంలో గతంలో నిర్మించిన ఘాట్ రోడ్డుకు అనుసంధానిస్తూ, రాజధాని ప్రాంతం నుంచి కొండవీడుకు తరలివచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం చౌడవరం వద్ద రూ.220 కోట్లతో కొండను తొలిచి టన్నెల్ నిర్మించే ప్రతిపాదనపై దృష్టి పెట్టారు.ప్రపంచ పర్యాటక ప్రదేశంగా కొండవీడును తీర్చిదిద్దాలన్న పాలకుల ఆశయంలో భాగంగా ఈ నెలలో 7, 8 తేదీల్లో భారీ స్థాయిలో కొండవీడు ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ రెండు రోజులు నిర్వహించే ఉత్సవాలతో కొండవీడు ప్రాంత ఖ్యాతి నలుదిశలా వ్యాపించడం ఖాయం.

**అబ్బురపరిచే వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు.. నోరూరించే వంటకాలు..**

వారం రోజులు నుంచి అధికార యంత్రాంగం నిర్విరామ కృషితో కొండవీడు కోటకు వెళ్లే రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులతో పాటు.. కోటపైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగింది. ఉత్సవాలకు వచ్చే పర్యాటకుల భద్రత, ఆనందాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి అంశాన్ని సునిశితంగా గమనించి ఏర్పాట్లు చేయడం జరిగింది. తొలిరోజు (శనివారం) ఉదయం యోగాతో ప్రారంభమయ్యే ఉత్సవాలు.. ఆదివారం రాత్రి వరకు కొనసాగే సాంస్కృతిక కార్యక్రమాలతో ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా హెలికాప్టర్ రైడ్, శాండ్ ఆర్ట్, రాక్ క్లైంబింగ్, ఫైర్ క్రాకర్స్ షో, హార్స్ రైడింగ్, ఫ్లవర్ షో, బోటింగ్, చిన్నారులకు ప్రత్యేక ప్లే జోన్, ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాట్లు ప్రధానాకర్షణగా నిలవనున్నాయి. జబర్దస్త్ బృందం నవ్వుల విందు.. గాయనులు గీతామాధురి, సమీరా భరద్వాజ్ సంగీత విభావరితో కూడిన ఆటపాటలు, విందువినోతాలతో అలసిపోయిన పర్యాటకుల అభిరుచికి తగినట్టు.. నోరూరించే రుచులతో ఫుడ్ ఫెస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇన్ని విశిష్టతలు.. విభిన్నతలు.. విందు, వినోదాలకు నిలయమైన కొండవీడు కోట అందాలను, చారిత్రక వైభవాన్ని ప్రతి ఒక్కరూ కన్నులారా, మనసునిండా ఆస్వాదించాలని కోరుతున్నాం. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, దేవాదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు చేతులుమీదుగా నేడు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యే ఉత్సవాలకు. ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం." అని మాజీమంత్రి ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు

# అక్షరాస్యత కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో శంకరరావు



వలేటివారిపాలెం వలేటివారిపాలెం మండలంలో అక్షర ఆంధ్ర కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశముల ప్రకారం వలేటివారిపాలెం పంచాయతీ పరిధిలో వడ్డీ పాలెం పోకూరు విజయవంతంగా ప్రారంభమైంది. ఎంపీడీవో వై శంకర్ రావు అక్షరాస్యత కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో వై శంకరరావు మాట్లాడుతూ మండలంలో నిరక్షరాస్యులను గుర్తించి, వాలంటీర్లను నియమించారు. వెలుగు సంస్థ ఆధ్వర్యంలో మార్చి వరకు కొనసాగే ఈ కార్యక్రమం, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకుంది. మండలంలో 100% అక్షరాస్యత సాధించడంలో ఇది కీలకమైనది.15-59 సంవత్సరాల వయోజనులపై దృష్టి సారించి.ప్రతి10 మంది అభ్యాసకులకు ఒక వాలంటీరు టీచర్ను నియమించి,శిక్షణ అందిస్తారు. శిక్షణలో పాఠశాల విద్యతో పాటు సమాజంలో జీవన విధానంలో అవసరమైన నైపుణ్యాలను , వృత్తి నైపుణ్యాలను, డిజిటల్ లిటరసీలో భాగంగా ఫోన్ పే, మనీ ట్రాన్సాక్షన్స్ వీడియో మరియు ఆడియో కాల్స్, అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కూడా బోధిస్తారు. ఇది నిరక్షరాస్యుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి సహాయపడుతుంది. ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరూ ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ అవకాశాలను అందిపుచ్చుకోవాలని లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని నిరక్షరాస్యులైన వయోజనులందరూ ఉపయోగించుకుని భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ లక్ష్యాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ ఏపిఎం శ్రీనివాసులు కమ్యూనిటీ కోఆర్డినేటర్ వాలంటీర్ టీచర్స్ పాల్గొన్నారు.

## 11 మంది హైస్కూల్ విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ

గుడ్లూరు,

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెడికల్ ఆఫీసర్ ఆద్వర్యంలో పాఠశాల విద్యార్థులకు దృష్టిలోపాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి యున్నారు. ఈ సందర్భంగా దృష్టిలోపం గుర్తించిన 11 మంది విద్యార్థులకు ఉచితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నెల్లూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారు ఉచితంగా కళ్ళజోళ్ళను ఆయా విద్యారులకు పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సాయి ప్రియాంక, సిహెచ్ ఓ సుబ్బారావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ చంద్రశేఖర్ ప్రధానోపాధ్యాయులు పి వి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగి దారుణ హత్య

కావలి.

నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలంలోని రుద్రకోట హరిజనవాడలో ఆరే. నాగరాజు అనే రైల్వే ఉద్యోగి తన నివాసంలోనే దారుణ హత్యకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో సీఐ రాజేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్య ప్రకాశం జిల్లా చిన్నగంజాం లో తల్లిదండ్రులువద్ద ఉంటుందని,నాగరాజు డ్యూటీ చేసుకుంటూ తన ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్నారని అంటున్నారన్నారు. నాగరాజు పిన్నమ్మ ఉదయం నాగరాజు ఇంటి వద్దకు ముగ్గు వేయడానికి వచ్చిందని తలుపు తీసి చూడగా మృతి చెందడం గమనించారన్నారు. ఈ విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని సీఐ రాజేశ్వర రావుతెలిపారు. దీంతో గ్రామస్తులంతా భయభ్రాంతులకు గురి అయ్యారు.

# ప్రత్యేక తనిఖీలు నిర్వహించి హై ఇంటెన్సిటీ ఎల్ఈడి లైట్లు తొలగించిన ఆర్టీవో నాగలక్ష్మి

కందుకూరు,

కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి ఆర్ టి ఓ కార్యాలయం వద్ద ఎల్ ఈ డి లైట్స్ (డ్యాజిలింగ్ లైట్స్) పై ప్రత్యేక తనిఖీ నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా ఆర్టీసీ హైర్ వెహికల్స్ 4 , ఆటో రిక్షాలు 12, మోటార్ సైకిల్స్ 10, కాలేజి బస్సులు 3 మరియు ఎల్జీవి వాహనములు 12, మాక్సీ క్యాబ్ లు 4, ఆపి ఎల్ ఈ డి లైట్స్ వల్ల జరిగే ప్రమాదముల గురించి వివరించి తొలగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఆర్టీవో టీ.వీ నాగలక్ష్మి మాట్లాడుతూ వాహనాలపై ప్రమాదకరమైన, నిబంధనలకు విరుద్ధమైన హై ఇంటెన్సిటీ ఎల్ఈడి లైట్లు అమర్చుకున్న వాహనములపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగినదని., ఇతరులకు ఇబ్బంది కలిగించే తీవ్రమైన కాంతి అనధికారిక ఫాగ్ లైట్లు మరియు సవరించిన హెడ్లైట్లు చట్ట విరుద్ధమని తెలియజేశారు. బ్లూ లేదా తీవ్రమైన వైట్ లైట్లు నిషేధించబడ్డాయని తెల్లటి లేదా పసుపు రంగులో లైట్లు మాత్రమే చట్టబద్ధమని, మోటార్ వాహనము చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఫాగ్ లైట్లు లేదా వైట్ లైట్లు వాడకంపై ఐదు వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చని తెలిపారు.ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశం ఎదురుగా వచ్చే వాహందారులకు ఇబ్బంది కలగకుండా ప్రమాదాలు నివారించడం కోసమని తెలియచేశారు. పై విషయమును గమనించి ప్రతి ఒక్క వాహందారులు స్వతహాగా మీ యొక్క వాహనమునకు బిగించిన ఎల్ఈడీ లైట్స్ ను తొలగించి కొంతమేరకు ప్రమాదములను అరికట్టడానికి తమ వంతు బాధ్యతగా ఉండగలరని తెలియజేశారు.

# విద్య జీవితాన్ని మార్చింది అనటానికి ఉదాహరణ సురేష్,జయసూర్య

**ప్రధానోపాధ్యాయులు మాధవరావు**

**- గ్రూప్ 2 పరీక్షల్లో ఉద్యోగాలు సాధించిన సురేష్, జయసూర్య లకు ఘన సన్మానం**

కందుకూరు, విద్య జీవితాన్ని మార్చింది అనడానికి పరుసు సురేష్, దమ్ము జయసూర్య లే నిదర్శనమని నల్లదలపూరు ప్రధానోపాధ్యాయులు బీరకాయల మాధవరావు అన్నారు.ఈమధ్య విడుదలైన గ్రూప్ 2 కందుకూరు నియోజకవర్గానికి చెందిన పరసు సురేష్ సబ్ రిజిస్టర్ గా, దమ్ము జయ సూర్య ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు. వీరిరువుని నలదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బీరకాయల మాధవరావు ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సన్మానించారు. గ్రూప్ టు లో ఉద్యోగాలు సాధించిన సురేష్, జయ సూర్య మాట్లాడుతూ తాము పేదరికరంలో ఉన్న కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించామని, పాఠశాల విద్యార్థులు కూడా కష్టపడి చదివి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకుని రావాలని వారు సూచించారు. అనంతరం వారిరువులను పాఠశాల సిబ్బంది గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.